వ్యక్తి అదృశ్యం

వెంకన్న(ఫైల్)

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్5: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. కొంపల్లి అశ్వినికాలనీకి చెందిన పోలెపాక వెంకన్న(53) జులై 7వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదు. దీంతో కుటుంబసభ్యులు అతడి ఆచూకీ కోసం బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓటర్ లిస్ట్ వెరిఫికేషన్

కొండాపూర్, సెప్టెంబర్ 5: రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న ఓటర్ లిస్ట్ పరిశీలన కార్యక్రమంలో భాగంగా గురువారం శేరిలింగంపల్లి సర్కిల్-20 పరిధిలోని కొండాపూర్ డివిజన్‌లో ఇంటింటికి తిరుగుతూ ఓటర్ల వివరాలు సేకరించారు. సేకరణకు వచ్చే సిబ్బందికి ఓటర్లు సహకరించాలని, తమ వివరాలు ఓటర్ లిస్ట్‌లో ఉన్నాయా? లేదా? తెలుసుకోవచ్చని సర్వే నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలు తెలిపారు. ఓ ఇంటి నుంచి మరో ఇంటికి షిఫ్ట్ అయిన, మరణించిన వారి వివరాలను సైతం తెలియజేయాల్సిందిగా తెలిపారు. కొండాపూర్‌లోని అన్ని కాలనీల్లో పరిశీలన కొనసాగుతున్నట్లు తెలిపారు.

లయన్స్ క్లబ్ చేయూత

ఆపదలో ఉన్నవారికి సాయం చేయాలనే ఆలోచనతో తమ క్లబ్ పనిచేస్తుందని లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ కొండా విజయ్ కుమార్ అన్నారు. ఆరోగ్య సమస్యతో బాధపడుతున్న శంకర్‌నగర్‌కు చెందిన నారాయణ చికిత్స నిమిత్తం లయన్స్ క్లబ్ హోప్ రూ.20వేల ఆర్థిక సాయాన్ని గురువారం నారాయణ కుమార్తె కోకిలకు చెక్కు రూపేణా అందజేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బసిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, ట్రెజరర్ రెడ్డి ప్రవీణ్‌రెడ్డి, సభ్యుడు దాసరి రాజశేఖర్, సంతోష్ ఉన్నారు.

– మాదాపూర్, సెప్టెంబర్ 5

కాలనీల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీకాలనీలో ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు

కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 5: కేపీహెచ్‌బీ కాలనీ, సీబీసీఐడీ కాలనీలో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను ఆదేశించారు. గురువారం కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని సీబీసీఐడీ కాలనీ, కాలనీ 3వ ఫేజ్‌లోని బస్తీదవాఖాన, ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీబీసీఐడీ కాలనీలో అధిక సామర్థ్యం పైప్‌లైన్ వేసిన తర్వాత.. ఆ పైప్‌లైన్‌లకు పాత నల్లా కనెక్షన్‌కు అనుసంధానం చేయలేదని, తద్వారా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యను పరిష్కరించేలా జలమండలి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్‌లోని బస్తీ దవాఖానలో పేదలకు అన్ని రకాల వైద్య సేవలందించాలని, డాక్టర్లు అందుబాటులో ఉండి.. వారికి సరిపడా మందులు అందించాలన్నారు. బస్తీ దవాఖానాలో మరుగుదొడ్లను ఏర్పాటు చేయడంతోపాటు చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. అలాగే పట్టణ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో సరైన వసతులు లేకపోవడంతో వైద్యులు, కాలనీ ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందని, ఈ సమస్య పరిష్కారం కావాలంటే.. పాత భవనాన్ని కూల్చి కొత్త భవనాన్ని నిర్మించాలన్నారు. కాలనీలో పేద ప్రజల కోసం ఆరోగ్య కేంద్రం భవనాన్ని నిర్మించేలా కృషి చేస్తానన్నారు. ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించే వరకు కాలనీలోని మహిళా మండలి భవనంలో ఆరోగ్య కేంద్రాన్ని కొనసాగించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఎం.కృష్ణారెడ్డి, రాజేశ్‌రాయ్, పాతూరి గోపి, సాయిశ్రీనివాస్, కచిన్, జీఎల్ ఎన్‌రెడ్డి, తులసీరెడ్డి, ఆయా కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు ఉన్నారు.

గణేశ్ నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి : సీఐ

అంబీర్ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ, కార్పొరేటర్

కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 5: గణేశ్ నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కేపీహెచ్‌బీ కాలనీ సీఐ వెంకటేశ్వర్‌రావు, కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు తెలిపారు. గురువారం హైదర్‌నగర్ డివిజన్‌లోని అంబీర్ చెరువులో నిమజ్జన వేడుకల ఏర్పాట్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీలు, బస్తీల్లో నెలకొల్పే వినాయక ప్రతిమల నిమజ్జనం కోసం అంబీర్ చెరువు వద్ద అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. చెరువు గట్టపై రెండు పెద్ద క్రెయిన్‌లు, ఒక చిన్న క్రెయిన్‌ను ఏర్పాటు చేయడంతోపాటు చెరువు చుట్టూ బారికేడ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చిన్న విగ్రహాల నిమజ్జనానికి కొలనును అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. నిమజ్జనం రోజున తాగునీటి వసతి, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వేడుకలను ప్రజలందరూ ప్రశాంతంగా జరుపుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఏఈ రాజీవ్, స్థానిక నేతలు నిరంజన్‌గౌడ్, వాసు, హనుమంతరావు, నిఖిల్ పాల్గొన్నారు.

'కాన్వాస్‌పై గణేశ్ పెయింటింగ్ చిత్రించండి'

దుండిగల్,సెప్టెంబర్5:వినాయక నవరాత్రి వేడుకలను పురస్కరించుకుని ఈ నెల 14వ తేదీన విశ్వగురు వరల్డ్ రికార్డ్ సంస్థ 'బ్రేకింగ్ గణేశ్ పెయింటింగ్' ఈవెంట్‌ను నిర్వహిస్తున్నట్టు ప్రముఖ నాసికా చిత్రకారులు, సద్గురు ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ఫౌండర్, డైరెక్టర్ లయన్ డా.సత్యవోలు రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. శతకోటి రూపాలలో విశ్వం అంతా దాగి ఉన్న గణనాధుడి చిత్రపటాలను పిల్లల స్థాయికి, పిల్లలు, పెద్దల స్థాయికి పెద్దలు వారి ప్రతిభను పట్టి 108నిమిషాలలో కాన్వాస్ మీద చిత్రించే పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమం విశ్వగురు వరల్డ్ రికార్డ్ ప్రతినిధుల పర్యవేక్షణలో నిర్వహించడం జరుగుతుందని, స్కూల్, కాలేజ్ విద్యార్థిని విద్యార్థులు, గృహిణీలు, చిత్రకారులు వయసుతో సంబంధం లేకుండా ఎవరైనా పాల్గొనవచ్చని తెలిపారు. విజేతలకు విశ్వగురు వరల్డ్ రికార్డు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి, బాచుపల్లిలోని వీఆర్‌ఎస్ విజ్ఞాన జ్యోతి స్కూల్ ప్రాంగణంలో ఈనెల14వ తేదీన శనివారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తామన్నారు. పోటీలల్లో పాల్గొనాలనుకునే వారు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 8501800947, 9849490663, 9959971679 ఫోన్ నంబర్లలో/www.satguruart.comలో సంప్రదించాలని తెలిపారు.

ఆర్ట్ గ్యాలరీలో 'గణేశ్' పెయింటింగ్ ఎగ్జిబిషన్

వినాయక చవితిని పురస్కరించుకుని మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో 'గణేశ్' పెయింటింగ్ ఎగ్జిబిషన్‌తోపాటు పెయింటింగ్ కాంపిటీషన్‌ను ఆర్ట్ గ్యాలరీ ఆధ్వర్యంలో నిర్వహించారు. గణేశ పెయింటింగ్ కాంపిటీషన్‌లో ఉత్తమంగా నిలిచిన మొదటి మూడు స్థానాలకు వరుసగా రూ.5వేలు, రూ.3వేలు (ఇద్దరికి), రూ.2వేలు (5మందికి) ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మీ చేతులమీదుగా అందజేశారు. కాగా, పోటీల్లో పాల్గొన్న 28మందితోపాటు మరో 45మంది చిత్రకారులు వేసిన 73 గణపయ్య చిత్రాలు ప్రదర్శనలో ఉంచారు. ఈ ప్రదర్శన సెప్టెంబర్ 9వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

– కొండాపూర్, సెప్టెంబర్ 5

ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కృషి : ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును కలిసిన వివిధ వర్గాల ప్రజలు

బౌరంపేట్‌లోని రోడ్డును గ్రావెల్‌తో చదును చేస్తున్న దృశ్యం

దుండిగల్, సెప్టెంబర్ 5: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకరవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులు, బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు, స్థానిక నేతలు గురువారం శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో ఎమ్మెల్సీ రాజును మర్యాదపూర్వకంగా కలిసి తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను వివరించడంతోపాటు వాటిని పరిష్కరించాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఆయన ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న గణపతి నవరాత్రి ఉత్సవాలకు విచ్చేయాలని ఆహ్వానపత్రికలు అందజేశారు.

సొంత నిధులతో రోడ్డు పనులు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ,మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్‌రాజు తన సొంత డబ్బులతో రోడ్డు మరమ్మతు పనులు చేయించారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బౌరంపేట్ నుంచి మల్లంపేట్, బాచుపల్లి వైపువెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమవ్వడంతోపాటు వాహనాలు తిరుగలేని పరిస్థితి నెలకొన్నట్లు తెలుసుకున్న ఎమ్మెల్సీ రాజు తన సొంత డబ్బు రూ.2లక్షలు వెచ్చించి తాత్కాలికంగా మరమ్మతు పనులు చేయించారు. ఈ నిధులతో గ్రామ పరిధిలోని అంతర్గత రోడ్లపై ఏర్పడిన గుంతలను గ్రావెల్‌తో పూడ్చివేయించారు. ఈ పనులను బౌరంపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి పర్యవేక్షించగా, స్థానిక నేతలు విష్ణువర్ధన్‌రెడ్డి, భీంరెడ్డి, మహిపాల్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, డప్పు కృష్ణ, రాజు, జీవన్‌రెడ్డి, సహదేవ్, బల్వంత్‌రెడ్డి తదితరులు దగ్గర ఉండి పూర్తి చేయించారు. కాగా, వినాయక చవితి పండుగకు రెండురోజులు ముందుగానే గ్రామంలోని రోడ్ల మరమ్మతులకు నోచుకోవడంతో స్థానికులు ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

మట్టి విగ్రహాల పంపిణీ అభినందనీయం

కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 5: పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయడం అభినందనీయమని కూకట్‌పల్లి సీఐ ముత్తు అన్నారు. గురువారం బాలాజీనగర్‌లోని మన అసోసియేషన్ అధ్యక్షుడు వై.వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లోని సీఐ, ఎస్సైలు, సిబ్బందితోపాటు కాలనీ ప్రజలకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. రసాయన రంగుల విగ్రహాలు కాకుండా మట్టి విగ్రహాలను పూజించి... పర్యవరణాన్ని కాపాడాలని ప్రజలను కోరారు.

వైద్యానికి ఆర్థిక సాయం

అనారోగ్యంతో బాధపడుతున్న ఓ బాలుడి చికిత్స కోసం ప్రగతినగర్ మాజీ ఉపసర్పంచ్, పట్టాభి రామాంజనేయ ఆలయం కమిటీ చేయూతనిచ్చింది. ప్రగతినగర్‌కు చెందిన ధనుంజయ కొడుకు (4)అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. అయితే వైద్య ఖర్చులు తలకు మించిన భారమవుతున్నట్లు తెలుసుకున్న ప్రగతినగర్ పట్టాభిరామాంజనేయ ఆలయ కమిటీ చైర్మన్ చల్లాసుధీర్‌రెడ్డి కమిటీ సభ్యులతో కలిసి ధనుంజయకు ఆలయ ప్రాంగణంలో రూ.25వేలు ఆర్థిక సాయంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి ధన్‌రాజు, ఉమాదేవి, జయలక్ష్మి, తులసీదాస్, రవీందర్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– దుండిగల్, సెప్టెంబర్ 5

సత్‌గ్యాన్ స్కూల్లో టీచర్స్‌డే వేడుకలు

ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ విలేజ్ సత్‌గ్యాన్ స్కూల్ కరస్పాండెంట్ లయన్ చింతల మల్లేశంను పూర్వవిద్యార్థులు పాఠశాలలో మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపికను అందించి ఘనంగా సన్మానించారు. –కుత్బుల్లాపూర్,సెప్టెంబర్ 5

జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ ఫర్ సోషల్ ప్రోగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లోని కమ్యూనిటీహాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్ర పటానికి ఫౌండేషన్ కమిటీ సభ్యులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించిన సీఆర్ ఫౌండేషన్ కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావు.

– మాదాపూర్, సెప్టెంబర్ 5

రోడ్డు పక్కన చెత్త డంపింగ్ చేస్తుండగా..

హైటెన్షన్ విద్యుత్ వైర్లకు తగిలిన టిప్పర్.. డ్రైవర్‌కు తీవ్రగాయాలు

దుండిగల్, సెప్టెంబర్ 5: రోడ్డు పక్కన చెత్తను డంపింగ్ చేస్తున్న టిప్పర్‌కు 11 కేవీ హైటెన్షన్ విద్యుత్ వైర్లు తగిలిన ఘటనలో టిప్పర్ టైర్లు దగ్ధమయ్యాయి.డ్రైవర్‌కు కూడా తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గాజులరామారం డివిజన్ పరిధిలోని కైసర్‌నగర్ సమీపంలో గురువారం ఉదయం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గాజులరామారం (సర్కిల్) డివిజన్ పరిధిలోని దేవేందర్‌నగర్‌లో నివాసముంటున్న హరిసింగ్ (35) టిప్పర్‌డ్రైవర్. ప్రతిరోజు గండిమైసమ్మ పరిసర ప్రాంతాల్లోని వ్యర్థాలను తన టిప్పర్‌లో తీసుకొచ్చి.. కైసర్‌నగర్ సమీపంలోని అటవీ ప్రాంతంలో డంపింగ్ చేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఆరు గంటల సమయంలో హరిసింగ్ రోజువారీ మాదిరిగానే కైసర్‌నగర్ సమీపంలోని రోడ్డు పక్కన టిప్పర్ అన్‌లోడ్ చేసేందుకు జాకీని పైకి ఎత్తాడు. దీంతో పైన ఉన్న 33 కేవీ విద్యుత్ తీగలకు టిప్పర్ డబ్బా తగిలింది. దీంతో విద్యుత్ షాక్‌తో ఒక్కసారిగా బ్యాటరీతో పాటు వెనుక టైర్లకు మంటలంటుకున్నాయి. అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి విద్యుత్ శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో వారు కరెంట్ సరఫరాను నిలిపివేశారు. అదే సమయంలో సమాచారం అందుకున్న జీడిమెట్ల అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. తీవ్రంగా గాయపడిన టిప్పర్ డ్రైవర్‌ను సూరారంలోని మల్లారెడ్డి వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం అతడు ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. ఈ కేసు సూరారం పీఎస్ పరిధిలోకి వస్తుందా..? లేదా జగద్గిరిగుట్ట పీఎస్ పరిధిలోకి వస్తుందా..!అనేది తేలాల్సి ఉంది.

వరదనీటి కాల్వ పనులు త్వరగా పూర్తి చేయాలి

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

వరదనీటి కాలువ పనులను జీహెచ్‌ఎంసీ అధికారులు, నాయకులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మాదాపూర్, సెప్టెంబర్ 5: వరద నీటి కాల్వ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఉషా ముళ్ళపూడి రోడ్డులో ఎల్లమ్మ చెరువు అలుగు వరకు రూ.2కోట్ల వ్యయంతో చేపడుతున్న వరద నీటి కాల్వ నిర్మాణ పనులను ఎమ్మెల్యే గాంధీ గురువారం స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్, జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. వరద నీటి కాల్వ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కాల్వ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలన్నారు. నాణ్యతలో రాజీపడకూడదని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని లోతట్టు ప్రాంతాలు, నీరు నిల్వ ప్రాంతాలను గుర్తించి ప్రజలు ఇబ్బందులకు గురవకుండా సన్నద్ధం కావాలన్నారు. ముంపునకు గురి కాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, సకాలంలో పనులను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు ఈఈ గోవర్ధన్ గౌడ్, ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, జలమండలి అధికారులు డీజీఎం నాగప్రియ, మేనేజర్ ప్రశాంతి, నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, రాజిరెడ్డి, విష్ణు, అర్జున్, సిద్ధార్థ్, అశోక్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

రోడ్డు విస్తరణ పనులతో ట్రాఫిక్‌కు చెక్

రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డుపై మాంజీరా పైప్‌లైన్ వాల్వ్‌లు రోడ్డు విస్తకరణకు అడ్డంకిగా మారిందని స్థానిక ఎమ్మెల్యే గాంధీ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువు నుంచి తులసి వనం వరకు రూ.30లక్షలతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను గురువారం జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం, జలమండలి అధికారులతోపాటు స్థానిక నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డుపై మాంజీరా పైప్‌లైన్ వాల్వ్‌లు రోడ్డు విస్తరణకు అడ్డంకిగా మారిందన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు ఈఈ గోవర్ధన్‌గౌడ్, ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, జలమండలి డీజీఎం నాగప్రియ, మేనేజర్ ప్రశాంతి, నాయకులు పాల్గొన్నారు.

దృష్టి మరల్చి బంగారం చోరీ.. నిందితుల అరెస్ట్

వివరాలు వెల్లడించిన బాలానగర్ ఏసీపీ హన్మంత్‌రావు

జగద్గిరిగుట్ట, సెప్టెంబర్ 5: దృష్టి మరల్చి బంగారాన్ని చోరీ చేస్తున్న నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. గురువారం బాలానగర్ ఏసీపీ హన్మంత్‌రావు, జగద్గిరిగుట్ట సీఐ క్రాంతి కుమార్ ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఖమ్మం జిల్లా మధిరకు చెందిన రిగురు బొజ్జగాని దీనమ్మ, బొజ్జగాని నాగేంద్రమ్మ, వెంకటరావమ్మ, బాలసాని అశోక్, బొజ్జగాని గ్యానమ్మ, బాలసాని వెంకటపతి బృందంగా ఏర్పడ్డారు.వీరు నగల షాపులకు కస్టమర్‌లుగా వెళ్తారు. అక్కడ బంగారం వస్తువులను చూసి సేల్స్‌మన్‌ను దృష్టిని మరల్చి అసలు నగలకు రోల్‌గోల్డ్ వస్తువులను భర్తీ చేస్తు చోరీకి పాల్పడుతున్నారు. గత నెల 27న ఒకేరోజు మూడు జువెల్లరీ షాపులలో దొంగతనం జరిగినట్లు కేసులు నమోదయ్యాయి. దీంతో జగద్గిరిగుట్ట పోలీసులు, సీసీఎస్ సైబరబాద్ టీమ్ సంయుక్తంగా టీమ్‌లుగా ఏర్పడి దీనిని సవాల్‌గా తీసుకున్నారు. సీసీపుటేజీల ద్వారా ఆధారాలను సేకరించారు. ఈనెల 4న పోలీసులు బొజ్జగాని దీనమ్మ, బొజ్జగాని నాగేంద్రమ్మ, వెంకట రవమ్మ, బాలసాని అశోక్‌లను అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు బొజ్జగాని గ్యానమ్మ, వాహన డ్రైవర్ బాలసాని వెంకటపతి పరారీలో ఉన్నారు. అదుపులోకి తీసుకున్న నలుగురిని విచారించగా చోరీకి పాల్పడిన్నట్లు ఒప్పుకున్నారు. వీరు మొత్తం 60 గ్రాముల బంగారం చోరీ చేసినట్లు తెలిపారు. పరారైన వారిని త్వరలో అదుపులోకి తీసుకుంటామన్నారు. వీరి వద్ద నుంచి స్విఫ్ట్ డిజైర్ కారు స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించారు. నాగేంద్రమ్మపై 12 కేసులు, దీనమ్మపై 11కేసులు, వెంకటరవమ్మపై 12 కేసులు ఉండటం గమనార్హం.

పరికి చెరువును సందర్శించిన రెవెన్యూ అధికారులు

జగద్గిరిగుట్ట/దుండిగల్,సెప్టెంబర్5 : చెరువుల ఆక్రమణలపై హైడ్రా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట భూదేవిహిల్స్‌లో ఉన్న పరికి చెరువు ఆక్రమణల నియంత్రణపై అధికార యంత్రాంగం ముందుకెళ్తున్నది. హైడ్రా ఏర్పడిన కొత్తలో కమిషనర్ రంగనాథ్ బృందం మొదటిసారిగా పరికి చెరువును సందర్శించి పరిశీలించారు. కాగా, పరికి చెరువు ఆక్రమణలపై వెళ్తున్న ఫిర్యాదులపై గురువారం కుత్బుల్లాపూర్ తహసీల్దార్ అబ్దుల్ రహమాన్, ఆర్ఐ ఖలీంలతో పాటు సిబ్బంది పర్యటించి సందర్శించారు. దీంతో చెరువు ఆక్రమణలపై పలు నివేదికలను తయారు చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. పరికిచెరువు ఆక్రమణకు గురి చేసి వందల సంఖ్యలో నిర్మాణాలు చేపట్టారు. దీంతో రాబోయే రోజుల్లో ఎలాంటి చర్యలు ఉంటాయోనని స్థానికంగా చర్చనీయంశంగా మారింది.

సీజనల్ వ్యాధులపై అవగాహన

దుండిగల్, సెప్టెంబర్5: గండిమైసమ్మలోని దుండిగల్ మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో తెలంగాణ సాంస్కృతిక సారథి మేడ్చల్ జిల్లా కళాకారులు గురువారం సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు అని వేటిని అంటారు.. అవి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాటలు, మాటల రూపంలో కళాకారులు ప్రదర్శనలు నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి మేడ్చల్ జిల్లా కళాకారుల బృందం లీడర్ బాలు, కళాకారులు శాంతిశోభ, రేణుక, సృజన్, కిశోర్, నరేశ్, మున్సిపల్ మేనేజర్ ఎస్.సునంద, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తున్న ఇద్దరు అరెస్టు

కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 5: గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకులను అరెస్ట్ చేసిన సంఘటన కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది.పోలీసులు తెలిపిన ప్రకారం.. హైదర్‌నగర్ శ్రీరామ్‌నగర్‌లోని ఓ ఇంట్లో గంజాయి సేవిస్తున్నారనే విశ్వనీయ సమాచారంతో పోలీసులు ఆకస్మికంగా తనఖీలు చేశారు. ఆ ఇంట్లో గంజాయి సేవిస్తున్న తాళ్ల రాజు(21), కె.అరుణ్(20) అదుపులోకి తీసుకుని, వారి వద్ద 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తుల వద్ద వారు గంజాయి కొనుగోలు చేసినట్లు తెలిపారు. వంద గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని.. వారిని రిమాండ్‌కు తరలించారు.

నిమజ్జన ఏర్పాట్లు పూర్తి చేయాలి

ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులతో జోనల్ కమిషనర్ సమీక్ష

వెస్ట్‌జోన్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న జడ్సీ ఉపేందర్ రెడ్డి

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 5: జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ పరిధిలోని వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ విభాగాల అధికారులతో వినాయక ఉత్సవ ఏర్పాట్లపై జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు గత సంవత్సరం ఎదురైన ఇబ్బందులు ఈ సందర్భంగా ప్రస్తావించారు. వినాయక నిమజ్జన విషయమై అవసరమైన రూట్లలో తాగునీటి సదుపాయం, ఊరేగింపు రహదారుల్లో చెట్లకొమ్మలు తొలగింపు, ప్రజా మరుగుదొడ్ల ఏర్పాటు, పరిశుభ్రమైన పరిసరాలుగా రహదారులను శుభ్రం చేయడం, గోతులు పూడ్చి మరమ్మతులు చేయడం, విద్యుత్ తీగలు, కేబుల్స్ వేలాడకుండా తీసుకోవాల్సిన చర్యలు, నిమజ్జన చెరువు ప్రాంతాల్లో వీధిదీపాల ఏర్పాటు విషయమై చర్చించారు. ఏర్పాటు పనులు వెంటనే జరిగేలా చూడాలని ఆయా విభాగాల అధికారులకు జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు, సూపరింటెండెంట్ ఇంజినీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

మేడ్చల్ జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు



రమాదేవి, రఘునాథ్‌లను సత్కరిస్తున్న జిల్లా కలెక్టర్ గౌతం

దుండిగల్,సెప్టెంబర్5: మేడ్చల్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన కే.రమాదేవి, పల్ల రఘునాథ్ ఎంపికయ్యారు. గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ పీ.గౌతం, డీఈవో విజయకుమారి కోలా రమాదేవి, రఘునాథ్‌లకు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందజేయడంతో పాటు శాలువాలు కప్పి సత్కరించారు. రమాదేవి సూరారంలోని నార్త్‌సిటీ హైస్కూల్ ప్రిన్సిపాల్‌గా పని చేస్తుండగా, పల్ల రఘునాథ్ నిజాంపేట్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. దీంతో ఆయా పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు పురస్కార గ్రహీతలను అభినందించారు.

■ మూసాపేట పంచశీల పాఠశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఉపాధ్యాయులందరినీ విద్యార్థులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ డి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 5

■ కొండాపూర్‌లోని సంస్కృతి గ్రూపు ఆఫ్ స్కూల్స్‌లో విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. స్కూల్స్ చైర్మెన్ మంగళారపు లక్ష్మణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. – కొండాపూర్, సెప్టెంబర్ 5